# 14

# నిర్ణయం

"నీకు నీ కొడుకుమీద నిజమైన ప్రేమ లేదు".

"ఏవిటి మీరనేది" నిర్లక్ష్యంగా భర్తవైపు చూసింది సరోజిని.

"ఉన్నమాటే అంటున్నాను. నువ్వెంతసేపూ నీ కూతుళ్ళ గురించి తప్ప కొడుకు సంసారం... వాడి సుఖసంతోషాల గురించి ఆలోచించవు. నీలాంటి వాళ్ళని ఆ దేవుడు కూడా మార్చలేడు" ఎప్పటినుంచో మనసులో ఉన్న ఆ రెండు మాటలూ అనేసి బయటికి వెళ్ళిపోయాడు రాఘవరావు.

ఆయన అలా అనడానికి తగినంత కారణం ఉంది.

తనకి అమెరికాలో ఉద్యోగం వచ్చినట్టు కొడుకు ప్రసాద్ చెప్పిన రోజు ఆనందం పట్టలేకపోయింది సరోజిని.

మా నాయన... మా నాయనే... ఇక్కడుద్యోగం వదిలేసెయ్యి. అమెరికా వెళ్తే బోలెడు డబ్బే డబ్బు... అని సంబరపడిపోతూ అడగని వాళ్ళక్కూడా ఊరూ వాడా అందరికీ చెప్పుకుంది గొప్పగా తన కొడుకు అమెరికాలో ఉండబోతున్నాడని... అక్కడికి తన కొడుకొక్కడే అమెరికా వెళ్ళబోతున్నట్టు, ఇంకెవరి పిల్లలూ అక్కడ లేరన్నట్టు... వెళ్ళలేదన్నట్టు. అది మొదలు... అక్కడి నుంచి ప్రసాద్ ఫోన్ చేసినప్పుడల్లా ఆవిడ మాట్లాడే మాటలొకటే... "ఒరేయ్! పైసా పైసా కూడబెట్టు... నీ మీద ఖర్చు పెట్టుకోకు. ఇద్దరు చెల్లెళ్ళున్నారు నీకు. వాళ్ళకి పెళ్ళిళ్ళూ పేరంటాలూ చెయ్యాలి. నీ స్నేహితులెవరు ఇండియా వస్తున్నా వాళ్ళ చేత నాకూ చెల్లెళ్ళకీ బంగారం ఎప్పట్లానే కొని పంపిస్తూ ఉండు. ప్రతి నెలా నువ్వు పంపిచే డబ్బు ఇలాగే ఒకటో తేదీకల్లా బ్యాంక్‌లో మాకొచ్చేస్తూ ఉండాలిరోయ్!"

భార్య మాటలు వినీ వినీ చీదరపుట్టింది రాఘవరావుకి. తను ఉద్యోగం చేస్తూనే ఉన్నాడు కదా... పూర్తిగా వాడిమీదే ఆధారపడి బతుకుతున్నట్టు ఎందుకలా వాడిని ఊదరగొట్టటం? వాడు కూడా ఊపిరి పీల్చుకోవాలా వద్దా?

చాలా పొదుపుగానే ఉంటూ నెల నెలా డబ్బు పంపడమే కాక ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకీ తనే డబ్బు ఖర్చుపెట్టాడు ప్రసాద్. ఆ తర్వాత తను చేసుకున్నాడు పెళ్ళి. అప్పట్నించీ తల్లిపోరు మరింత ఎక్కువైంది.

వరసగా కూతుళ్ళ సీమంతాలు. వాళ్ళ పిల్లల బారసాలలు... పుట్టినరోజులు అన్నీ హైలెవెల్‌లో జరిపించాలి. ఊళ్ళో ఎవ్వరూ కనీ వినీ ఎరగని రీతిలో చెయ్యాలి. దానికి తగినట్టుగా కొడుకులుంగారు డాలర్లు వెదజల్లాలి.

"ఒరే! అమెరికాలో ఉన్నావు నువ్వు. నీ తాహతుకి తగ్గట్టు మేవిక్కడ జరిపించాలి. మన చుట్టాలందరికీ కళ్ళు కుట్టాలి. అందరూ నా చుట్టూ భజన చేస్తూ తిరగాలి. నాకు తెల్సులే నీకు అమ్మంటే ఎంత ప్రేమో! నీ చెల్లెళ్ళకి నువ్వంటే ఎంత అభిమానమో!" ముందరి కాళ్ళకి బంధం వేసేది.

అన్నగారు పంపించే డబ్బుకోసం తప్ప నిజంగా ఆ చెల్లెళ్ళ మనసులో అన్నమీద ప్రేమ పొంగి పోవట్లేదన్న సంగతి రాఘవరావుకి మాత్రమే తెలుసు.

వాడికీ పెళ్ళయింది. వాడి సంసారం వాడిని హాయిగా సవ్యంగా చేసుకోనిచ్చేలా వీళ్ళు లేరన్న చింత ఆయనకి బాగా పట్టుకుంది.

"అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. మాకో కారు కొనిపెట్టకూడదా అన్నయ్యా?" తల్లి దగ్గర పెద్దకూతురు రమ గారాలు పోయిందో రోజు.

"చెల్లెళ్ళు మీరు కాక... పొరుగింటి నించి వచ్చిన ఆ కోడలు మహమ్మారి అనుభవించడానికా నా కొడుకు సంపాదించే డబ్బు? చూస్తూ ఉండు. నాల్రోజుల్లో మీరు కారు కొనుక్కోడానికి డబ్బు పంపాలని వాడికి ఫోను చేస్తాను".

అన్నది సాధించింది సరోజిని.

ఇంక రెండో అల్లుడు మటుకు ఊరుకుంటాడా? తప్పలేదు ప్రసాద్‌కి ఆయనగారిక్కూడా సమర్పించుకోవడం.

తన భార్యా పిల్లల కోరికలు అణగదొక్కుతూ... చెల్లెళ్ళవి ఇంటి అల్లుళ్ళవి గొంతెమ్మ కోరికలు తీరుస్తూ... వాళ్ళ గుమ్మాల్లో ఖరీదైన లేటెస్ట్ మాడల్ కార్లు నిలబెట్టిన కొడుకుని ఏ మాత్రం మెచ్చుకోలేకపోయాడు రాఘవరావు. వాళ్ళకి లేకితనం నేర్పుతున్నాడు చేజేతులా అనిపించింది.

పులిమీద పుట్రలా పెద్దల్లుడికి ఉద్యోగం పోయింది. ఆఫీసులో ఏదో గోల్‌మాల్ చేశాడని పీకేశారు ఉద్యోగంలోంచి. కాళ్ళు తన్ని పెట్టుకుని సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తూ హాయిగా ఇంట్లో కూచుంటున్నాడు. ఎవడి మోచేతికిందా ఉద్యోగం చెయ్యను. నా బావమరిది అమెరికాలో ఉన్నాడు. ఆ మాత్రం చెల్లెలి కుటుంబాన్ని పోషించలేడా అంటూ అందరి దగ్గరా వాగుడు మొదలుపెట్టాడు. దానికి తందాన తాన తల్లీ కూతురు.

ఎత్తుకెత్తూ మరో కుటుంబాన్ని పోషించాలంటే ఈ రోజుల్లో మాటలా? ఒక్క తిండితోనే అయిపోదు కదా? ఇంకో ఇల్లన్నాక ఎన్ని ఖర్చులూ? అందులో పైగా పిల్లల చదువులకయ్యే ఖర్చు అంతా ఇంతానా ఈ కాలంలో?

"నీకిదేం రోగమే? కొడుకుని కాపురం చేసుకోనివ్వవు... ఆ కూతురికీ అల్లుడికీ బుద్ధిలేకపోతే నీ బుద్ధీ బుర్రా ఎక్కడికి పోయాయి?" సీరియస్‌గానే అన్నాడు రాఘవరావు.

కానీ సరోజినిక్కావల్సిందల్లా కోడలు సుఖపడకుండా ఉండడమే. ఎప్పుడూ చెల్లెళ్ళ రంధితో కొడుక్కి మనశ్శాంతి లేకుండా చేస్తుంటే ఆటోమేటిగ్గా ఆ భార్యాభర్తల మధ్య గొడవలొస్తూనే ఉంటాయి. దానివల్ల కోడలు ఏడ్చుకుంటూ కీచులాడుతూ కాపురం చేస్తుంది. ఇంక సంతోషం ఎక్కడుంటుంది దాని మొహానికి. అదే ఆవిడక్కావల్సింది. తన అన్న కూతుర్ని చేసుకోమంటే మేనరికం చేసుకోనని ఇష్టంలేదంటూ ఈ పిల్లని చేసుకున్నాడన్న కక్ష పీకలదాకా ఉంది ఆవిడకి. నిజంగా కొడుకు మీద ప్రేమ ఉన్నదైతే వాళ్ళ కాపురంలో తంపులు పెట్టాలని ఎందుకనుకుంటుంది?

✧ ✧ ✧

తల్లి ఏడ్చే దొంగ ఏడుపుల్తో... చెల్లెళ్ళ సంసారాల సమస్యలతో మెంటల్‌గా చాలా అప్‌సెట్ అయిపోతున్నాడు రాను రాను ప్రసాద్. తండ్రి కూడా రిటైర్ అయ్యాడు.

ఆ రోజు ఫోన్లో తల్లి ఓ పెద్ద పిడుగు పడేసింది.

చిన్నల్లుడుగారు ఉద్యోగం మానేసి వ్యాపారం చెయ్యదల్చుకున్నారుట.

"బిజినెస్ చేస్తార్టరా... నువ్వు పెట్టుబడి ఇవ్వాలి. ఎంతైనా నీ చెల్లెలి మొహం చూసి ఇవ్వకుండా ఎలా ఉంటావు?"

రెండు రోజులు పిచ్చి పట్టినట్టు ఆలోచించాడు ప్రసాద్. ఆ విసుగూ చిరాకూ చూపించుకుందుకు భార్య ఉందిగా!

ఎన్నాళ్ళని ఆ భార్యమటుకు భరిస్తుంది. అమెరికాలో ఉన్నామన్న పేరే గాని చిన్న చిన్న సరదాలూ చిన్న చిన్న కోరికలు కూడా తీర్చని భర్తని భరించడమే కాక... అతని విసుగులూ చిరాకులూ అలకలూ ఎన్నాళ్ళని భరించాలి అన్న ఆవేదన ఆమెని క్రుంగదీస్తోంది.

పెళ్ళిళ్ళయి ఇన్నేళ్ళయినా... పిల్లలు పెద్దవాళ్ళవుతున్నా... అక్కడ వాళ్ళు స్థిరపడట్లేదు. ఇక్కడ తమని మనశ్శాంతితో బతకనివ్వట్లేదు... వాళ్ళందరూ ఇక్కడినుంచి వస్తున్న డాలర్లతో దర్జాగా గడుపుతున్నారు. తమకే ఓ ఇల్లంటూ కొనుక్కోడానికి డబ్బుల్లేవు. ఇక్కడిన్నేళ్ళుగా ఉంటున్నా కూడా. అందుకే భర్తతో ఓ రోజు అనేసింది. చిన్నల్లుడుగారు బిజినెస్‌లో పెట్టిన డబ్బంతా హుష్‌కాకి, దివాలా తీశారని ఫోన్ వచ్చిన రోజు... ఆ రోజు...

"ఇలాంటి వాళ్ళ వల్ల మన ఇద్దరి మధ్య దూరం పెరగడం మీకు బావుందా?"

కోపంగా చూశాడు "నీకసలు ప్రేమాభిమానాలు... ఉంటేగా?"

చిర్రెత్తుకొచ్చిందామెకి "తన సంసారాన్ని తను పోషించుకోక ఇంకొకడి మీద ఆధారపడిపోయి పైలా పచ్చీసుగా గడిపేవాళ్ళ అడుగులకి మడుగులొత్తుతూ జీవితం గడిపితేనే ప్రేమాభిమానాలున్నట్టా? అయినా నాకు తెలియక అడుగుతానూ... వాళ్ళవేనా కుటుంబాలు? వాళ్ళవేనా సంసారాలు? మనది సంసారం కాదా? మీరూ నేనూ మన పిల్లలూ మనదొక కుటుంబం కాదా? ఎంతసేపూ వాళ్ళని గురించిన ఆలోచనల్తో మీలో మీరు మథనపడిపోతూ నేనేదన్నా చెప్పబోయినా పురుగులా నన్ను తీసిపడేస్తుంటే... నాకు మీ వాళ్ళ మీద ప్రేమాభిమానాలెందుకుంటాయి? ఎందుకుండాలి? ఏ ఆడదానికైనా అత్తగారు మంచిదైనా కాకపోయినా పువ్వుల్లో

పెట్టి చూసుకుంటూ ప్రేమ చూపించే భర్త ఉంటే సంతోషిస్తుంది. దానికి నోచుకోలేదుగా నేను... అలాంటప్పుడు నాలో ప్రేమాభిమానాలెందుకుంటాయి వాళ్ళమీద?"

తెల్లబోయాడు ప్రసాద్. చేదు నిజం అతని మొహాన్ని పాలిపోయేలా చేసింది. భార్య మాటల్లో ఏ మాత్రం అబద్ధం లేదని అతని మనసుకి తెలుసు. కానీ ఒప్పుకోవడానికి అతనిలో ఉన్న అహంకారం అడ్డొచ్చింది.

✧ ✧ ✧

ప్రతిరోజూలాగే పొద్దున్నే రేడియో ఆన్ చేద్దామనుకున్నాడు రాఘవరావు. కానీ రేడియో స్థానంలో రేడియో లేదే?

"ఇదిగో... సరోజినీ... రేడియో లేదిక్కడ... ఇక్కడినించి తీసి మరెక్కడైనా పెట్టావా?"

"ఇప్పుడా రేడియో లేకపోతే ఏమైపోతుందీ? చిన్నమ్మాయి వాళ్ళూ కావాలంటే ఇచ్చేశాను. నిన్న రాత్రి మీరు నిద్రపోయాకొచ్చి పట్టికెళ్ళింది".

"ఇచ్చెయ్యడం ఏమిటీ? పొద్దున్న లేచింది మొదలు రాత్రి పడుకునే దాకా నాక్కాలక్షేపం అదే అని నీకు తెలుసుకదా?"

"అయితే మాత్రం బాధేం ఉందీ? అలాంటివి ఎన్నయినా కొనివ్వగలడు మనబ్బాయి. రేపేవాడికి ఫోన్లో ఓ ముక్క చెప్తాలెండి, దానికోసం ఈ నెల మరికాస్తెక్కువ పంపుతాడు డబ్బు".

సిగ్గు లేకపోతే సరి... నువ్వీ జన్మకి మారవు... ఒళ్ళు మండుకొచ్చింది రాఘవరావుకి.

మొన్నటికి మొన్న కిందటి నెల్లో... చక్కగా పనిచేస్తున్న టి.వి. ఎవరికో అమ్మేసి ఆ డబ్బు చిన్నల్లుడి జల్సాల కోసం ఇచ్చింది.

వెంటనే కొడుక్కి ఫోన్ చేసి "టీవీ పాడైపోయిందిరా... పనిచెయ్యట్లేదు. కొత్తది కొనాలి" అంటూ అబద్ధాలు... దానికోసం ప్రత్యేకంగా మళ్ళీవాడు డబ్బు పంపడం... వాడి కష్టం దోచి ఈ పైలాపచ్చీసుగాళ్ళకి పెట్టడం ఏమిటి? ఎన్నాళ్ళిలా?

అందుకే రాఘవరావు ఒక్కముక్కలో భార్యమీద తనకున్న అసహ్యాన్ని బయట పెట్టాడు. "నీకు నీ కొడుకు మీద నిజమైన ప్రేమలేదు".

✧ ✧ ✧

ఎప్పుడు కొడుకు ఫోన్ చేసినా భర్తని మాట్లాడనివ్వదు సరోజిని.

మొదటినుంచీ చివరిదాకా... కూతుళ్ళ కాపరాలకి ఇంకా ఏవేం కావాలో... వాళ్ళ పిల్లల చదువులకి ఇంకా మంచి మంచి పెద్దస్కూళ్ళల్లో కాలేజీల్లోకి మార్పించాలి. డొనేషన్లు ఇంతంత కావాలి గుర్తుపెట్టుకో మంటూ లిస్టు చదవడం, మధ్య మధ్యలో కొడుకుని ఐస్ చేస్తూ వాడు పొంగిపోయి బుట్టలో పడేలా మాట్లాడుతూ... భర్తచేతికి మాత్రం ఫోన్ ఇవ్వదు.

ఆ రోజు రాఘవరావు అదృష్టం... సరోజిని పక్కింటి వాళ్ళతో గుడికెళ్ళింది. ఆ సమయంలో వచ్చింది ఫోను.

"ఎలా ఉన్నావురా? కోడలు పిల్లలు ఎలా ఉన్నారు?"

"మేము బాగానే ఉన్నాం నాన్నగారూ".

"ఒరే! నిన్ను పిచ్చివాడిని చేసి ఆడిస్తున్నార్రా మీ అమ్మ చెల్లెళ్ళు కలిసి. వెర్రివెంగళప్పలా పెంచిందిరా మీ అమ్మ నిన్ను. దేనికైనా ఒక హద్దు అంటూ ఉంటుందిరా".

"ఏవిటి నాన్నగారూ?"

"ఔనురా... సొంత ఇంట్లో ఉంటున్నాం మేమిద్దరం. అద్దె కట్టే పన్లేదు. నెలకింతని మాకు సరిపడా నువ్వు పంపుతున్నావు. హాయిగా కడుపులో చల్ల కదలకుండా సుఖంగానే ఉన్నాం కదా. అయినా కూడా మిమ్మల్ని మనశ్శాంతిగా బతకనివ్వడం దానికిష్టం లేదురా, అపాత్రదానం చేస్తున్నావు నువ్వు".

"తప్పు నా మీదికి తోస్తున్నారా నాన్నగారూ?"

"ఔనురా... మొట్టమొదటి తప్పు మీ అమ్మది. ఆ తప్పుని మొదట్లోనే తుంచెయ్యకపోవటం నీ తప్పు. మొక్కయి వంగనిది మానై వంగుతుందా? నీ చెల్లెళ్ళు, మీ అమ్మ నోరు తెరిస్తే అబద్ధాల పుట్టలు. వాళ్ళ గురించి ఇలా చెప్పవలసి రావడం నాకు బాధగానే ఉంది. కానీ నిజానిజాలు నీకు తెలియాలి. ఇప్పటికే చాలా ఆలస్యమైంది. వాళ్ళ తప్పులు వాళ్ళు దిద్దుకుని జీవితపు విలువలు తెలుసుకుని మసలుకోవాలన్న జ్ఞానం వాళ్ళకి కలగనివ్వట్లేదు నువ్వు. అతిమంచితనం కూడా ఒక వ్యసనం కిందకే వస్తుంది నా దృష్టిలో. సోమరిపోతుల మీద చూపించకూడదు

మంచితనం. అతివినయం ధూర్తలక్షణం అన్నారు పెద్దలు. నీ బావగార్ల పట్ల నువ్వు చూపించే వినయాలు ఆ కోవకి చెందినవిగానే కనిపిస్తున్నాయి నాకు. ఇలా అన్నందుకు నీక్కోపం వచ్చినా సరే... నేను చెప్పాల్సింది చెప్పాను".

"నాన్నగారూ..."

"ఇంకా ఉందిరా అసలైన ముఖ్య విషయం చెప్పాల్సింది. మీ చెల్లెళ్ళు వాళ్ళతో వీళ్ళతోనూ ఏం చెప్పుకుంటున్నారో తెలుసా? మా సంసారాలకి డబ్బు పంపిస్తూ మా శ్రీవార్లకి సోమరితనం అలవాటు చేశాడన్నయ్య. అందుకే మా సంసారాలిలా ఏడ్చాయి. అక్కడేమో తను హాయిగా ఉన్నాడని చెప్తున్నారు ముగ్గురూ కలిసి నాటకాలు బాగానే ఆడుతున్నారు. అన్నగారి వల్లే వాళ్ళ కాపురాల్లో సుఖం లేకుండా పోయిందని నలుగురూ అనుకోవాలన్న దుర్మార్గపు ఆలోచన వాళ్ళది. ఇప్పుడు చెప్పు... తప్పు ఎక్కడ మొదలైందో?"

ప్రసాద్ చేతిలో ఫోన్ బిగుసుకుంది. చెక్కబొమ్మల్లే నిలబడ్డాడు. కళ్ళల్లో నీళ్ళొక్కటే తక్కువ.

"నా తప్పు నాకిప్పటికి అర్థమైంది నాన్నా" గొంతులో సన్నగా పశ్చాత్తాపం ధ్వనించింది.

"ఇన్నేళ్ళుగా ఈ నిజం నీతో చెప్పుకునే అవకాశం నాకు రాలేదు. ఇప్పుడు చెప్పాక నా మనసు తేలిగ్గా ఉంది".

"రెంటికీ చెడ్డ రేవడిలా ఉంది నా బతుకు. మీ కోడలు మంచి మనసుతోనే నాకర్థమయ్యేలా ఎంతో చెప్పాలని ప్రయత్నించింది ఇన్నాళ్ళూ. కానీ నేనో మూర్ఖుడిని కాబట్టే తను అసూయతో ఈర్ష్యతో చెప్తోందనుకున్నాను".

"ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని వాళ్ళ బతుకులు వాళ్ళు సరిదిద్దుకుంటారో మానతారో వాళ్ళకే వదిలెయ్యి".

"మరి వాళ్ళ బతుకు తెరువుకి మార్గం?"

"నువ్వు ఆ సంసారాల్ని పోషించడం మానేస్తేనే వాళ్ళ బతుకు తెరువుకి మార్గాలు వాళ్ళు చూసుకుంటారు. ఇంకో విషయం చెప్పాలి నీకు... నువ్వు విదేశంలో ఉన్నావు కాబట్టి నన్నూ అమ్మనీ ఇక్కడ చూసుకోవాల్సింది వాళ్ళే కదా అన్న అభిప్రాయాన్నీ

మొహమాటాన్నీ నీ మనసులోంచి తీసేసెయ్యి. ఈ ఇల్లు ఒక పోర్షన్ తాళం పెట్టుకుని మనకిందే ఉంచుకుని మిగిలిన భాగం అద్దెకిచ్చి ఆ వచ్చే అద్దె డబ్బూ నెలనెలా నువ్వు పంపించే డబ్బూ పెట్టుకుని మాకు నచ్చిన ఏ ఆశ్రమంలోనో ఉంటే ప్రశాంతంగా మా జీవితం గడుస్తుంది. ఈ వయసులో కావాల్సింది ప్రశాంత జీవనం. సమస్యలు కొని తెచ్చుకుంటూ దెబ్బలాటలు గొడవలు పెంచుకుంటూ పోయే జీవితం కాదు. ఎవరికైనా సరే పెద్దవయసులో కావాల్సినది ఆధ్యాత్మికత ప్రశాంతత. ఆ రెండూ వాటంతట అవి పరిగెత్తుకుంటూ మన దగ్గరికి రావు. మనసు తలుపులు తెరిచి మనమే వాటిని ఆహ్వానించాలి. కాబట్టి నువ్వు నా నిర్ణయాన్ని కాదనకు ప్రసాద్" తండ్రి అభిప్రాయంతో మనస్ఫూర్తిగా ఏకీభవించాడు ప్రసాద్.

*ఆంధ్రభూమి వారపత్రిక, 1 నవంబర్ 2007*